

# 5 అనగనగా ఒక చేప

మర్నాడు సుబ్బరాజు రాగానే రామిరెడ్డిగారు ఆప్యాయంగా రమ్మని కూర్చోబెట్టి మినప సున్ని ఉండలు, మంచితీర్థం, పాలు తెప్పించి "భోం చెయ్యండి" అన్నాడు.

"ఎందుకండీ" అన్నాడు సుబ్బరాజు.

"మరేం లేదు, ఈ కథలు చూశావూ, ప్రతిదీ ఒక్కలాటి వాక్యంతోనే ఆరంభమవుతోందిట. రాసేవాడొకటే గోల. బాబ్బాబు రాగానే కథారంభించకండి. ఇంకేదన్నా చెయ్యండని దేవుళ్ళాడాడు నిన్న రాత్రిటేపొచ్చి. ఆ మాటార్రైటే అనుకో. అందుకుని ఇవాళిలా మొదలెట్టాను. నువ్వూ మనసులో పెట్టుకో. రేపెల్లక్షను ప్రచారం చేస్తావు గదా. ఏ సభ కెళ్ళినా చెప్పేవి ఆ నాలుగబద్ధాలే అయినా ఆ సభలో వాళ్ళిక్కడుండర్లే అని గ్రాంఫోను ప్లేటులా మాట్లాడబోకు. అటు దిటూ ఇటుదటూ మారస్తా ఉండాలి. ఈ సభలో జనం అందరూ ఇంకో దానికి వస్తారా అనమోకు. అందర్రాకపోయినా అందరి పెట్టూ కొందరుంటారు. అప్పోజీషను మనుషులను, పత్రికల రిపోర్టర్లను లవుడు స్పీకరాళ్ళను, 'ఈడికి పాడిందే పాటలే' అని ఊరంతా పాడి పేరు కరాబు చేయడానికి అళ్ళు చాలు. పయిగా ఆ రిపోర్టర్లున్నారే మా జాగ్రత్తగా ఉండాలి అదే పాట ప్రెచ్చోటా పాడావని పసిగడితే ఇహ ఈ ఉపన్యాసాలు పేపర్లో బడవు, ఒకటి రాసి పంపేసి, 'మిగతావన్నీ ఇంతే' తారీఖు ఊరుపేరు మార్చి అచ్చు కొట్టండి. కావాలంటే ఆ కాస్త మొదట్లో సదరండి అని రాసేస్తాడు ఆ పత్రికాఫీసుకు. అంచేత ఎచ్చరిగ్గా ఉండాలి. నీవంటోడే ఒక రాజుగారు పార్లమెంటెలక్షను టూరు చేశారుట. ఆయన కూడా తిరుగుతున్న రిపోర్ట్రు ఆశ్చర్యపడుతూ 'అయ్యా! రాజుగారూ! మీలాగా మాటాడేవాణ్నే నే చూళ్ళేదండీ. ఈ మూడు రోజుల్లోనూ మీరు మొత్తం 27 ఊళ్లు తిరిగి 38 ఉపన్యాసాలిచ్చారు దెల్సా' అన్నాట్ట. రాజుగారు దగ్గరెవరూ లేకుండా జూసి నవ్వి, 'యెర్రిమొకవా నేను 38 ఉపన్యాసాలివ్వలేదోయ్. ఒకటే ఉపన్యాసాన్ని 38 సార్లు వల్లించానోయ్' అన్నాట్ట. ఈడు జెప్పేదాకా ఆడు కానుకోనేలేదు. అంత రంజుగా జెప్పాడు, అద్గదీ కథ. ఆరగింపయిందా, ఇహ నాలకింపా రంభించుకో" అంటూ కథ మొదలెట్టాడు రెడ్డిగారు.

అనగనగా ఓ మంత్రిగారు. ఆయనోమారు ఒక గడుసు బిల్లు తయారుచేసి దాన్ని

చట్టం కడదామన్నారు. దాంట్లో చాలా లిటికేషన్ ఉంది. అయినా లోపాయికారీగా నలుగుర్నీ మంచి చేసుకుని దాన్ని సభకెక్కించారు. గిట్టని వాళ్ళు రచ్చకిలాగి సెలక్షను కమిటీ వేదామన్నారు, వేశారు. అపోజిషన్ వాళ్ళకేగాక, అయిన వాళ్ళలో కూడా అందరికది నచ్చలేదు. వాదోపవాదాలు జరిగాయి. ఓటు కొచ్చింది బిల్లు. కమిటీలో చీలికలొచ్చాయి. బిల్లు కన్నతండ్రి నలుగురికీ నచ్చజెప్పి మెజారిటీలో ఓట్లు – ఒక్కటే అనుకో – ఆకట్టుకున్నాడు. కాని తీరా ఓటింగ్ అయ్యేసరికి ఆ ఒక్కటే ఎదురు తిరిగిపోయింది. బిల్లు వద్దంటే వద్దన్నారు. అయనకి దుఃఖం వేసింది. ఆ రాత్రి చాలా మధనపడి, దగా చేసిన ఓటును జూసి, "ఓటూ! ఓటూ! నివ్వెందుకు పండలేదే?" అన్నాడు. ఓటు పకాలున నవ్వింది. 'దేవరా! ఈ ప్రశ్న నన్నడిగితే అడిగావు గాని ఇంకెవర్నీ అడక్కు. ఇప్పుడడిగితే అడిగావుగాని ఇంకెప్పుడూ అడక్కు. కొన్ని విషయాలు మరీ అవసరమయితే తప్ప అరా తీయరాదు. తీస్తే అనక విచారిస్తావు. ఓ కథ చెబుతాను విను' అంటూ ఆరంభించింది ఆ ఓటు.

'దేవరా! వెనకటికో మంత్రి గారుండేవారు. అయన ఓనాడు భోజనానికి కూర్చున్నాడు. మాంసాహార శాకాహారి. చేపల కూర వడ్డించారు. ఓ ముక్క ఇట్టే నోట్లో వేసుకుని అట్టే ఉమ్మేశాడు. అది ఉడకలేదు. వంటమనిషిని కేకేసి ఏమిటిది అని గద్దించారు మంత్రిగారు. ఏడు చేపలు కొన్నామండి, ఎండేశాం. ఒకటి – ఇదేకామోసు – ఎండలేదు. ఆరేశాను. కాని చాలదనిపించి కూర దింపే ముందు దీన్ని పడేశాను అన్నాడు. మంత్రిగారి కిందులో ఏదో కుట్ర కన్పడింది. ఇది ఎంచేత ఎండలేదు? మిగతావన్నీ ఎండినపుడు దీనికేం రోగం? ఇదేం అసెంబ్లీ అనుకుందా? మునిసిపల్ కవున్సిలనుకుందా? ఇండిపెండెంటు మెంబరనుకుందా' అని కోప్పడ్డాడు.

"చేపా చేపా ఎందుకెండలేదు?" అన్నారు లాలనగానే.

చేప ఏమంత చదువుకోలేదు. రాజకీయాల సంగతి ఎరగదు. సామాన్య పౌరుడులాటిది. పోలీసువాడొచ్చి 'ఎడంకాలు ముందేసి కుడికాలుతో తరవాతడుగేస్తావేం? ఆఁ' అంటే భయపడి "చిత్తం కుడికాల్లో ముల్లు గుచ్చుకుందండి" అని చెప్పే రకం. అంతే తప్ప పౌరహక్కుల గురించి మాట్లాడ్డం రాదు.

"గడ్డిదుబ్బు అడ్డొచ్చిందండి" అంది చేప ఇంకేం తోచక.

మంత్రిగారు ఆరోజు ఐదారు పార్టీల కెళ్ళొచ్చినందువల్ల ఆకలి అట్టే లేదు. అందుకని ఈ సంగతి విచారించాలని తోచింది. వెంటనే అందుకు ఉద్యమించారు భోజనానికి కాసేపు అడ్జర్నమెంటు వేసి.

"దుబ్బా, దుబ్బా, ఎందుకడ్డొచ్చావ్?" అని అడిగారు.

"ట్రాక్టరు మిషనువాడు అన్నిటినీ కొట్టేసి నాదాకా వచ్చి ఎందుకు మానేశాడో కొట్టడం?" అంది దుబ్బు.

"ట్రాక్టరు మిషనువాడూ, ట్రాక్టరు మిషనువాడూ, దుబ్బు నెందుక్కొట్టలేదూ?"

"ఆ భూమి బంజరు దన్నారండి. సాగుకి లాయకీ జేసి అక్కడేదో ఫారం బెట్టాలని ఆఫీసు వాళ్ళు దాన్ని సదును చెయ్యమని పంపారు. చేస్తుండగా అది రాజకీయ బాధితుడెవరికో శాంక్షనై పోయిందని టెలిగ్రామొచ్చింది. పని ఆపెయ్యమన్నారు. అప్పటికీ దుబ్బుదాకా వచ్చాను. మానేశాను. ఇపుడు ఆఫీసులో నా మీద ఇంక్వేరీ

కూడానండి. ఎవరికో ఇచ్చిన భూమిని నువ్వెందుకు సాగుచేసావు? నీకొకరోజు జీతం తెగ్గోస్తాము, మిషిను అనవసరంగా వాడినందుకు జుల్మానా అని అన్నారండి. మీ రెల్లమంటే ఎల్లా, నాకివన్నీ ఏం తెలుస్తాయి అంటే... వింటంలేదు... ఇపుడు కొత్త కామందు ఆ భూమికి రైతుని పెట్టాడు. అదూ ఇంకా పన్లోకి రాలేదు" అన్నాడు ట్రాక్టరువాడు.

"రైతూ, రైతూ, నువ్వెందుకు పన్లోకి రాలేదు?"

"ఏది బాబయ్యా, కవులు కాయితం రాయందే. అళ్ళు రాజకీయ నాయకుళ్ళండి. కవులు కీగూడదు గావాల. ఇచ్చినా దున్నే ఓడిదే భూమని చట్టం వస్తుందంటగా! బయ్యం అందుకని. అరు చెన్నపట్టానున్నారు. తర్లొచ్చాక దగ్గరుండి చేయిస్తారట. ఇందాక ఆ జాడ తెల్లేదు. చేస్తే ఈ పాటికి నాలుగు పంటలు తిరిగేవి. కాలవ కింద భూమయింది గదా" అన్నాడు రైతు.

"రా. బా. రా. బా! నువ్వెందుకొచ్చి భూమి బాగు చేయించలేదు?"

"అయ్యా, వాక్యాలు సరిగా రానీయండి. నేనూ రాజకీయాల్లో తిరిగేవాణ్ణే. నేను ఒచ్చానని, ఒచ్చి కూడా భూమి బాగుచేయలేదనీ ధ్వని వచ్చేలా మీరు సెలవిస్తున్నారు. అది తప్పు. నేను ఇంకా మెడ్రాసులోనే ఉంటున్నాను. అటేపొస్తే ఒచ్చాక ఆ పని చూస్తాను. అసలు దాని మీద శిస్తు సంగతి ఇంకా తేల్లేదు. కాలవపడింది కాబట్టి మాగాణి రేటున కడతామంటున్నారు. అదలా ఉండగా మేము కుటుంబంగా వెళ్ళిపోయి కూచుంటే ఇందరికీ అది చాలదు. దాని క్యాసిన్ని ఉద్యోగపురాళ్ళు తోడుండాలి. మా వాడిని ఆ ఊరు బదిలీ చేయించుకుందామని చూస్తున్నాం. ఆ సెక్రట్రీ ఎంతకీ బదిలీకి ఒప్పుకోవటం లేదు" అన్నాడు రా.బా. గారు.

"సెక్రట్రీ, సెక్రట్రీ ఎందుకు బదిలీ చెయ్యవూ?"

"బలేవారండి మీరు. మీ మినిస్టర్లని చూస్తే మా సెక్రట్రీల కిందుకే ఒళ్ళు మండుతుంది. ఏ విషయం పూర్వాపరాలేమిటో మీకు తెలీదు. పైగా అదిలా చెయ్యి. ఇదలా చెయ్యి అని జులుం చేస్తారు. మీకేం నాలుగేండ్లుండి పోతారు. మాకిది యావజ్జీవం ఉండేది. మీ రడిగిన కుర్రాడు బదిలీ వొద్దు మొర్రో అంటూంటే, మీరొచ్చి వాణ్ణే పాపం ఎందుకు బదిలీ చెయ్యవంటారు. ఏమిటిది?" అన్నాడు సెక్రటరీ వినయం ఉట్టిపడుతూ.

"కుర్రాడా? కుర్రాడా? ఇది నిజమేనా? నువు బదిలీ ఒద్దు మొర్రో అంటున్నావా? ఎంచేత?" అని అడిగాడు మంత్రిగారు.

"అయ్యా, ఈ ఉద్యోగం దొరకడానికి పడ్డ యాతన మీకేం తెల్సు? ఆ సెక్రట్రీకేం దెల్సు? దీన్ని ఆర్నెల్ల జీతం పెట్టి కొన్నాను, ఒకరి ద్వారా. నెలనెలా సగం జీతం ఇచ్చుకుంటున్నాను. వచ్చే నెల బాకీ తీరుతుంది; మళ్ళీ మా నాన్నతో అనేరు. ఆయన చాదస్తుడు. లోగడ తను చేసిన త్యాగానికీ దేశ సేవకీ మెచ్చి విశ్వాసం కొద్దీ ప్రజలూ సర్కారు వారూ నాకీ ఉద్యోగం ఇచ్చారని ఆయన నమ్మకం. లంచాలివ్వడం పుచ్చుకోవడం పనికిరాదంటారు. ఇవ్వకా పుచ్చుకోకా ఇంకేం చేస్తారు? లంచాన్ని దాచుకుంటారా? ... అయ్యా, నేనున్నది కామధేనువు లాంటి ఉద్యోగం. మాగాణి పొలంలాంటిది. ఏగాణి డబ్బు వస్తే ఇందులోనే రావాలి.

దీన్నొదులుకుని బంజరు భూములు దున్నుకుందాం రమ్మంటాడు ముసలాయన. ఆయనకేందెల్సు? పై యేటికి వస్తాంలెండి. రెండు పెద్ద కేసులున్నాయి. వాట్లో బాగానే దొరికేట్టుంది. అదొస్తే మా ఊళ్ళో ఇళ్ళు కట్టుకుంటాం. ఒకదాంటో వేలంపాట బాగా సాగుతూందింకా! పైపాట పాడేవాడు తాలూకు బ్రోకర్ ఎంచేతో ఇంకా రాలేదు" అన్నాడు కుర్రాడు.

"బ్రోకరూ, బ్రోకరూ, నువ్వెందుకు చప్పున వెళ్ళి ఆ లంచం పెట్టవూ?"

"ఏది బాబూ మా చేతుల మీదుగా వేలకువేలు తిరగడమే తప్ప మాకు మిగిలేది వేళ్ళే. పదిరోజులాయి జరంతో తీసుకుంటున్నా. తగ్గి చావదు. ధర్మాస్పత్రి మందు, చప్పున్తగ్గాలంటే డాక్టరుగారి ప్రవేట్ డిస్పెన్సరీ కెళ్ళాల్ట. అంత డబ్బేదీ? ఏదో పావలా అర్ధా కంపౌండ్రు చేతబెట్టి ఈ మందే తాగుదాం అని కూర్చున్నాను, తగ్గలేదు" అన్నాడు బ్రోకరు.

"మందూ, మందూ, నువ్వెందుకు తగ్గించవూ?" అని అడిగారు మంత్రిగారు.

"నన్ను మందంటావేమిటి? రంగు నీళ్ళలో మునిగి ఊపిరి సలపక చస్తూంటే, కంపెనీవాడూ కంపౌండ్రూ అంతా తలా కాసినీ పోశారాయె ధర్మోదకాలు" అంది మందు.

"కంపౌండ్రూ, కంపెనీవాడూ, మీరెందుకు నీళ్ళు కలిపారు?" అని అడిగారు మంత్రిగారు.

వాళ్లు పకాలున నవ్వారు. మా ఇద్దర్నీ అలా జవిలిగా కలిపడిగితే ఎలాగయ్యా అన్నారు.

"మీరిచ్చే డబ్బై నాలుగు రూపాయల జీతంలోనూ నేను రెండు పూటలా తిని పెళ్ళాంబిడ్డలకింత పెట్టగలనని మీరు అనుకోవటం లేదని మీకు తెలుసు. పైనేదో దొరక్క మానదన్న ఊహ మీకూ ఉంది. నేను రెండో పూట తిండి మానేసినా పస్తుండటం లేదు. టిఫిన్ కిదే గతి కదా..." అన్నాడు కంపౌండరు.

"నేను నీళ్లు కలపడానికి పర్మిషన్ కొన్నానుగా. ఏవీ కలపకపోతే ఇంగ్లీషు కంపెనీలతో పోటీచేసి స్వదేశీ పరిశ్రమలెలా బ్రతుకుతున్నాయి? ఈ సంగతి మీకన్న డ్రగ్గినస్పెక్టర్లకే బాగా తెలుసు" అంది కంపెనీ.

"డ్రగ్గినస్పెక్టరూ, డ్రగ్గినస్పెక్టరూ, నువ్వెందుకు పర్మిషనిచ్చావు?" అని అడిగారు మంత్రిగారు.

"బావుంది. కంపెనీవాడి బంధువర్గం గురించీ, పలుకుబడి గురించీ మీకు తెలీందేవుంది. నేను ఇవ్వనంటే ఆగేదా చచ్చేదా. మధ్ద న్నాఉద్యోగం ఊడుతుంది. రూల్సు అన్నం పెట్టవు గదా. పైగా హోటళ్ళలో తిండి మీద టిఫిన్ మీద తనిఖీలు చేసే శాంటరీ ఇన్స్పెక్టర్లూ, టాక్సు ఇన్స్పెక్టర్లూ వాళ్ళూ కళ్ళు మూసుకు బాగుపడుతుంటే నేను మటుకు మడి గట్టుకోడవేంవిటి? అయినా రోగాలూ, ప్రాణాలూ మందుల్ని బట్టి రాకపోకలు జరుపుతాయండీ – అంతా ఖర్మనిబట్టి జరుగుతుంది. నేనీపాటి జాగర్త పడకపోతే మావాడి నీపాటికి వందసార్లు బళ్ళోంచి పొమ్మనేవారు. స్కూలు జీతం ఓ పూట లేటయితే ఆ మేస్టరు నా జాతకం అంతా చదివేసి కుర్ర వెధవని పొమ్మంటున్నాట్ట" అన్నాడు ఇన్స్పెక్టరు.

"మేష్టారూ, మేష్టారూ మీరు జీతం గట్టనివాళ్ళని ఎందుకు పొమ్మంటారు? అది పైవాళ్ల పని గదా?" అని అడిగారు మంత్రిగారు.

స్వామీ విషాదానందలా మందహాసం చేసి కండువా సవరించుకున్నారు మేష్టారు.

"మంత్రిగారూ! నేను కండువా వేసుకు బళ్ళో కొచ్చిననాడు అందరూ ఏం చెప్పకు నవ్వుకున్నారో తెలుసా? నా చొక్కా, భుజాల మీద చిరిగి భుజకీర్తు లేర్పడ్డాయని, కోటేసుకుంటే – మా ఫాదరిల్లా పాతకోటు లెండి – కోటేసుకుంటే మా అబ్బాయి చొక్కా వేసుకున్నట్టూ, దానికి వీపు మీద ఏమీ లేనట్టూ కొండగుర్తు. ఆపైన నేను పిల్లల్ని కొట్టకపోతే ఆ రోజు కాఫీ...."

"అయ్యా! ఒక్క నిమిషం. ఏడు చేపల కథ అని ఒకటి ఉంది. మీరు వినే ఉంటారు. అందులో శాల్తీలన్నీ అడిగిన ప్రశ్నలకి ఒక్క ముక్కలో సూటిగా టూకీగా జవాబిస్తాయి. ఇందాకనించి చూస్తున్నా. మీరు ఒక్కొక్కళ్ళు చాట భారతం చదువుతారెంచేత? అంత పెద్ద జవాబు ఎందుకు?" అన్నారు మంత్రిగారు చిరుకోపంతో.

"చిత్తం. మీ ప్రశ్నలు చాలా పెద్దవి. మరి జవాబులూ వాటిని బట్టి. నాకు తెలుసు మీకు విసుగని. ఒక్క ముక్కలోనే చెబుతాలెండి. మరేం కాదు. జిల్లా బోర్డువాళ్ళు జీతాలిచ్చి ఐదునెల్లయింది. జీతం రాలేదని పాలవాడి క్కూడా చెప్పకూడదు. చెబితే పై వాళ్ళ ప్రిస్టేజ్ చెడుతుందిట. వాళ్ళ దగ్గర డబ్బు లేకపోవడానిక్కారణం ఈ కుర్రవెధవలు ఫీజులు కట్టకపోవడమేనని నా ఊహ. నిజమైనా కాకపోయినా, మేం కాస్త దబాయిస్తే పడేవాళ్ళు వాళ్ళే కదా పాపం, ఎవర్నంటే ఎవరూరుకుంటారు" అన్నారు మేష్టారు.

"జిల్లా బోర్డూ, జిల్లా బోర్డూ, పంతుళ్ళకి ఐదునెల్లాయె జీతాలెందుకివ్వలేదు" అని అడిగారు మంత్రిగారు.

"సరి సర్లేండి మా బాగా అడిగారు. ప్రెసిడెంటుగారి టూరు బిల్లులు, సినిమా స్టార్లకి పార్టీ బిల్లులు, మినిస్టర్లు తనిఖీలకీ వాటికీ వీటికీ వచ్చినప్పటి బిల్లులూ ఇవే ఇంకా శాంక్షన్ కాలేదు. మర్చిపోయాం మీకు సన్మానం చేసినప్పటి ఖర్చులో మా వాటా కూడా ఉంది. అదింకా తేలలేదు. పంతుళ్ళ జీతాల బిల్లులెక్కడా" అంది జిల్లా బోర్డు జాలిగా నవ్వి.

మంత్రిగారికి ఇంకెవరి నేమడగాలో పాలుపోలేదు. ఇందాకా అడగడమే బుద్ధి తక్కువనిపించింది. ఊసుపోకకి తీగలాగితే డొంకంత కథ – తలా తోకాలేనిది – కదిలింది. పోనిస్తూ మనకేల ఊరుకుందాం అని అనుకున్నారు. కాని, ఆ లోపల ఆయన అభిమానులు అజ్ఞానం కొద్దీ ఈ గాథని ఊళ్ళో ప్రచారం చేశారు. పేపర్ల కెక్కించారు.

వెధవది బోయినంలో కూరముక్క ఉడకలేదని విచారణ ఆరంభించి దేశంలో అవినీతి, ఆర్థిక బాధలు వ్యవసాయ సమస్యలు అన్నింటిపైనా స్వయంగా దర్యాప్తు చేస్తున్నారు శ్రీవారు. ఈ మాటని ప్రతిపక్షాల వాళ్ళు గుర్తుంచుకోడం మంచిది అవటాని ప్రచారం చేశారు. పత్రికలలో ఈ వింత వార్త ప్రముఖంగా వివరంగా పడింది – పూర్వకాలపు రాజులు విక్రమార్కుడూ వాళ్ళూ రాత్రిళ్ళు మారువేషాలు

వేసుకుని తిరిగి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్న ఉదంతాలన్నీ ప్రస్తావించి శ్రీవారిని స్తుతించారు. బాక్సులు కట్టి విశేషాలు వేశారు.

ఇంత గొడవయినందుకు మంత్రిగారు విసుక్కున్నారు. కాని అప్పటికే చాలామంది ఈ విచారణపై నివేదిక అడిగారు.

ఇది ఇలా బహిరంగంగా చెప్పేది కాదని, దీనికై తానే కమిటీ వేసి చర్చింపజేసి ఈ సమస్యా పరిష్కారానికి మార్గాలు చూస్తామని వాగ్దానం చేశారు మంత్రిగారు.

ప్రముఖులతో ఒక సంఘం ఏర్పాటయింది. ముఖ్య పట్టణాలలో మీటింగులు పెట్టుకున్నారు. చివరి సమావేశం ఊటీలో పడింది.

మంత్రిగారి సమస్య సత్వర పరిష్కారానికి మార్గాలు సూచిస్తూ వారు ఒక నివేదిక అందజేశారు. అందిన కొద్ది సేపటిలోనే సమస్య పరిష్కారం అయిపోయిందని మంత్రిగారు ప్రకటించారు.

అని, కథ చెబుతున్న 'ఓటు' ఆగింది. ఆగి 'అయ్యా మంత్రిగారూ. మీరు చెప్పండి చూతాం. ఈ కథలో మంత్రిగారి సమస్య ఎలా పరిష్కారం అయింది? ఆ నివేదికలో చెప్పిన మార్గాలు ఏవి?' అని అడిగింది.

ఆ మంత్రిగారు చెప్పలేకపోయారనుకో, సుబ్బరాజా నువ్వు చెప్పు చూతాం. ఈ ప్రత్యేక సంఘ నివేదికలో చెప్పిన మార్గాలు ఏమిటి? మంత్రిగారు ఏం చేశారు? అన్నారు రామిరెడ్డిగారు కథ ఆపి. సుబ్బరాజు ఒక్క క్షణంలో జవాబు చెప్పాడు.

"ఆ కమిటీ వారు సమస్యను మూడు నెలలపాటు కూలంకషంగా చర్చించి చివరకు రెండు మార్గాలు సూచించారు. ఒకటి ఆ ఎండని చేపని ఆ దుబ్బు నీడ పడని చోటుకు జరిపి ఎండన ఎండబెట్టడం. రెండోది కొంచెం ఖర్చుతో కూడినది. అయినా ప్రజల సమస్యలు ఎన్నో ఇందులో ముడేసుకు ఉన్నాయి కాబట్టి – ప్రభుత్వ ఖర్చుపై ఆ దుబ్బును కొట్టించి వేయడం. కమిటీలో సభ్యుడు ఒకాయన మాత్రం మంత్రిగారికి అయిన వాడయి నందువల్ల ఆయన శ్రేయస్సు కోరి, నివేదికకు నిజాయితీ కట్టబెట్టడానికి వీలుగా వ్యతిరేకాభిప్రాయం చివర్న రాశాడు – ఈపాటికది కుళ్ళి చెడి ఉంటుంది కాబట్టి ఆ చేపముక్కను వీధిలో పారెయ్యాలని. మంత్రిగారు ఈ చివరి సూచనను అమలు జరిపి ఉంటారు."

రామిరెడ్డిగారు మందహాసం చేసి లేచి తువ్వాలుతో మొహం తుడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయారు.

★ ★ ★